# పువ్వు నవ్విన పున్నమి

ఈ నెల 26వ తేది శనివారం ఉదయం తొమ్మిది గంటల యాభైఆరు నిమిషాల కు మన అనసూయ వివాహం. నువ్వు వెంటనే బయలుదేరి రావాలి అంటూ యిరవై మూడో తారీఖున నాకు మా పెద్దనాన్న గారింటి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. పెద్దనాన్న అంటే మా నాన్నగారి అన్నయ్యకాదు. మా అమ్మదొడ్డమ్మ పెద్దల్లుడు. వాళ్ళయింటికి వెళ్ళడమంటే మా అందరికీ మంచి సరదా. అందులో నాకు మరీ ఎక్కువ యిష్టం.

పెళ్ళిళ్ళు యధావిధిగా శాస్త్రోక్తంగా ఐదు రోజులు చెయ్యాలని పట్టుబట్టే వాళ్ళలో ఆయన మొదటివాడు. పెళ్లి అంటే ఆయనకు కనీసం యాభైవేల రూపాయల ఖర్చు. ఇంటికి వచ్చిన వందలాది అతిధులలో ప్రతి ఒక్కరూ సంతృప్తితో ఆనందంతో వెళ్ళాలని ఆయన కోరిక. అందుకనే కాబోలు ఆయన యింట్లో శుభకార్యం అనగానే బంధుకోటి యావత్తు నాలుగురోజులు ముందరే రావలసిందే. ఆయన మంచితనానికి బంధు ప్రేమకి తగ్గట్టుగానే సిరీసంపదా వున్నాయి. కాని మనిషన్న తరువాత లోటు లేకపోతే ఎల్లా? అందుకని ఆయనకడుపున ఆడపిల్లలేకాని మొగపిల్లలు పుట్టడానికి నోచుకోలేదు.

స్కూలు ఫైనల్ సెలవుల్లో పెద్దనాన్నగారింటికి మొదటిసారిగా వెళ్ళాను. అప్పుడు ఆయన పెద్ద కూతురు వివాహం. నన్ను చూడగానే పిల్లలందరూ పెళ్ళి కూతురుతో సహా అమిత సంతోషంతో నన్ను చూడగానే "అమ్మా రామం అన్నయ్య వచ్చాడు" అని అనగానే, దొడ్డమ్మా పెద్దనాన్న బయటకు వచ్చారు. పెద్దనాన్న చనువుగా నన్ను దగ్గరకు తీసుకున్నాడు. స్టోరు తాళం చెవి నా చేతిలో పెట్టాడు.

"వంటవాళ్ళ బాధ్యత నీది" అని అన్నాడు.

ఆనాటినుంచియీనాటి వరకూ వాళ్ళ యింట్లో ఏ పెళ్ళి జరిగినా, నేను వెళ్ళడం సామాన్ల కొట్టు అజమాయిషీ చేస్తూ వంట వాళ్ళకి హంగుగా వుండటం ఆచారమైపోయింది. ఇల్లా నలుగురి పిల్లల పెళ్ళిళ్ళు జరిగాయి. ఇది ఆఖరు పిల్ల పెళ్ళి, ఎంతో వైభవంగా చెయ్యవలసింది. ఈసారి పెద్దనాన్న ఒక రోజు పెళ్ళి ఏర్పాటు చేయించడం చాలా ఆశ్చర్యం వుందే !

మొగపెళ్ళివారు అనుకున్న దానికంటే ఎక్కువ కట్నం కోరారా? అల్లా జరగడానికి అవకాశం లేదు. తన మీద ఆంక్షలు, షరతులు పెట్టేవారితో పెద్దనాన్న ఎప్పుడూ

బంధుత్వం కలుపుకోడు. ఇంతవరకూ ఆయనతో వియ్యమొందినవారంతా ఆయనంత మంచివాళ్ళే. అందుకు సందేహం లేదు.

ఈ ఆలోచనలకి సమస్యలకి అంతం లేదు. "రేపు ఉదయం మెయిల్లో వస్తున్నాను." అని పెద్దనాన్నకి టెలిగ్రాముయిచ్చి రైలుకు బయలుదేరాను. రైలు వాళ్ళ ఊరు చేరేసరికి తెల్లవారుఝాము ఐదు గంటలయింది. ఇంటి దగ్గర పిల్లలంతా నిద్దురపోతూ వుంటారని అనుకుంటూపెద్దనాన్న వాళ్ళ ఇంటి తలుపు తట్టాను.

మరుక్షణంలో తలుపు తెరుచుకుంది. ఎదురుగా పెద్దనాన్న కూతురు జానకి నిలబడి వుంది. నన్ను చూడగానే, సంతోషంతో "అమ్మా అన్నయ్య వచ్చాడే!!" అని అనగానే ఒక్క క్షణంలో మా చెల్లెళ్ళంతా వచ్చి నన్ను చుట్టు ముట్టారు. పెద్దనాన్న లోపలినుంచి వచ్చాడు. నేను అలవాటుగా గుడ్‌మార్నింగ్ అని అన్నాను.

"గుడ్‌మార్నింగ్ నువ్విహనుంచి వచ్చేటప్పుడు టెలిగ్రాము యివ్వద్దు."

"ఏం?"

"నీ టెలిగ్రామ్ వచ్చినప్పటి నుంచి, నిద్దర మానుకుని అంతా యిక్కడ కూర్చున్నారు. ఒకవేళ నీ రైలు లేటు అయితే, నువ్వు వచ్చిందాకా అన్నం కూడా తినరు" లోపలికి ఎప్పుడు వెళ్ళిందో ఏమో కాని జానకి కాఫీతో సిద్ధమైంది. కాఫీ త్రాగి మేడమీదకు నా సామాన్లు తీసుకువెళ్ళాను. పెళ్ళికూతురు యింకొక కప్పు కాఫీ తీసుకు వచ్చింది.

'ఇప్పుడే తాగానుగా' అని అంటే

'ఇది స్పెషల్'' అని అంది.

దాన్ని చూస్తుంటే నాకు ఆశ్చర్యం వేసింది. నిన్నగాక మొన్న దీన్ని ఎత్తుకుని తిప్పేవాడిని. ఒకసారి మా యింటికి వచ్చినప్పుడు తిరుగుతున్న సైకిలు చక్రంలో కాలు పెట్టింది. అది అప్పుడే పెళ్ళికూతురైంది. కాలం ఎంత త్వరగా గడిచిపోతుంది?

"రామకృష్ణ వచ్చాడా ?" అని అడిగాను.

"గ్రాండుట్రంకులో వస్తాడు."

స్నానం చేసి డ్రస్ మార్చుకుని రైలుస్టేషనుకు వెళ్ళాను. రామకృష్ణుడు మా అత్తయ్య కొడుకు. నాగార్జునసాగర్‌లో ఇంజనీరు. వాడికి యీ ప్రపంచంలో బంధువులు కాని వాళ్ళంటూ లేరు. ఇటువంటి శుభకార్యాలలో చేతనైనంత సహాయం చెయ్యడమంటే వాడికి సరదా. మంచి కసరత్తు శరీరం కావడం వల్ల, ఎంత భారీ పనైనా సరే అతి అవలీలగా చేసివేసేవాడు. అయిదడుగుల విగ్రహం

మిలటరీ మీసాలు వాడిని చూస్తే పెద్దవాళ్ళకే రవ్వంత జంకు కలిగినా, వాడి మంచితనం ఆపేక్ష ఒకసారి తెలుసుకుంటే, వాడిని ఎప్పటికి వదలిపెట్టరు. అందుకనే వాడు వస్తున్నాడంటే గవర్నరు వచ్చినంత ఘన స్వాగతం యిచ్చారు.

రైలు స్టేషనులోకి వస్తూ ఒక్కసారి గర్జించింది. అంతకంటె బిగ్గరగా మా వాడి కంఠం 'రామం' అంటూ నన్ను పిలిచింది. రైలు ఆగింది. వాడు ఒక్కవురుకుతో క్రిందకు దిగాడు. నూటనలభై పౌనుల నన్ను ఒక్కసారి చంటిపిల్లవాడిని ఎగరవేసినట్లు ఎగరేసి క్రిందకు దింపాడు.

"ఎప్పుడు వచ్చావురా?" అని అడిగాడు.

"ఇవ్వాళ మెయిల్లో"

'గుడ్' అంటూ పెట్టి బేడా కూలీవాడి చేతికిచ్చి "పద" అని అన్నాడు.

ఇంటికి చేరగానే, పెద్దనాన్న మా యిద్దరికీ సామానుల కొట్టు అప్పచెప్పి తను మొగపెళ్ళివారి విడిదికి వెళ్ళాడు. ఎక్కడెక్కడ ఏం సామానులున్నయో గుర్తు చూచుకొని రామకృష్ణ వంటయింటి వైపు తిరిగి,

'కృష్ణయ్యగారు!' అంటూ పొలికేక పెట్టాడు.

'బాబు' అంటూ కృష్ణయ్యగారు వచ్చాడు. మా యిద్దరిని చూడగానే, సంతోషంతో

'కృష్ణార్జునులు యిద్దరూ వచ్చేశారే! ఇహ మాకే యిబ్బందీ వుండదు' అంటూ వంట యింటి వైపు తిరిగి

'రంగా' అంటూ పిలిచాడు

'వస్తున్నానండీ' అంటూ ఒక కుర్రవాడు వచ్చాడు

ఆ కుర్రవాడిని మాకు చూపించి

'మా పెద్దబ్బాయి' అంటూ పరిచయం చేశాడు.

మే మేదో మాట్లాడుదామని అనుకుంటూ వుండగానే

'మొన్ననే ఆనర్సు పరీక్షకి వెళ్ళాడు' అని చెప్పేసరికి నేను రామకృష్ణ ఒక్కక్షణం ఏం మాట్లాడలేక పోయాం. ఎందకంటే మా యిద్దరివీ వానాకాలపు చదువులు, పట్టభద్రులంకావడమే అందని మ్రానిపండ్లు తలప్రాణం తోకకు వచ్చింది.

రామకృష్ణ అంతలోనే తెప్పరిల్లుకుని "గ్లాడ్‌టుమీట్ యూ" అంటూ చెయ్యిజాపాడు.

'మీ సబ్జెక్టేమిటి ? అని నేను అడిగాను.

'నా సబ్జెక్ట్' అని కృష్ణయ్య గారు సమాధానం యిచ్చారు. అప్పుడు అసలు

విషయం గుర్తుకు వచ్చింది. కృష్ణయ్య గారు లెక్కలలో మద్రాసు విశ్వవిద్యాలయం పట్టభద్రులు. కాని లెక్కలకంటె కూడా ఆయనకు పెళ్ళి వంటలు ఆర్గనైజు చేయించడం అంటేనే ఆయనకి మంచి సరదా. వంటవాళ్ళ గ్రూపు ఒకటి తయారు చేశాడు. అందులో అంతా హేమా హేమీలే. ఎవడి సబ్జెక్ట్‌ల్లో వాడు పి.హెచ్.డి. వీళ్ళ సహకారంతో, తన పర్యవేక్షణలో కృష్ణయ్యగారు పెళ్ళి అయిదు రోజులు, తన భోజనంతో, స్వర్గాన్ని భూమి మీదకు తీసుకువస్తాడు. ఈ శ్రమకు ప్రతిఫలంగా, ఆయన ఫీజు ఐదు వందల ఎనభై రూపాయిలు ఏవిధంగానూ ఎక్కువకాదు. పెద్దనాన్నగారి యింట్లో మాత్రం ఆయన కానీ పుచ్చుకోడు. పైగా వధూవరులకి కానుకలుకట్నాలు తీసుకువస్తాడు.

పెద్దనాన్న ఆయనకేం బంధువు కాదు. అంత మాత్రంలో పరాయివాడు కాదు. వాళ్ళ యిద్దరూ ఆప్తమిత్రులు. ఈ స్నేహం కూడా చాలా విచిత్రమైన పరిస్థితులలో జరిగింది. ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో పెద్దనాన్న సత్యాగ్రహంచేసి, జైలుకు వెళ్ళాడు. కృష్ణయ్యగారు కూడా సత్యాగ్రహం చేసి అదే జైలుకు వచ్చారు. ఒక రోజున మాటల్లో వంట విషయం వచ్చింది. రవకేసరి చెయ్యడం గురించి వీళ్ల యిద్దరిమధ్య చిన్న అభిప్రాయభేదం వచ్చింది. మా పెద్దనాన్న చెప్పింది కృష్ణయ్యగారు కాదన్నారు. సరే మనకిహ వాదనెందకు, చేసి చూపించండి అని కృష్ణయ్యగారు షరతుపెట్టి సంధికి వచ్చారు.

అందరి సమక్షంలో పెద్దనాన్న రవకేసరి చేసి చూపించాడు. కృష్ణయ్యగారు మెచ్చుకున్నాడు. ఆనాటి నుంచి వాళ్లుయిద్దరు ఆప్తమిత్రులైయ్యారు. ఆ మైత్రి ఏళ్ళతో బాటు పెరిగిందేకాని వీసమెత్తు కూడా తరగలేదు. పెద్దనాన్న గారింట్లో ఏ శుభకార్యం జరిగినా కృష్ణయ్యగారు వచ్చి నిలబడవలసిందే, అందులో యిప్పటి పెళ్లికూతురంటే ఆయనకి ప్రత్యేకమైన ఆపేక్ష. మిగతా పిల్లలంతా ఆయన్ని కృష్ణయ్యగారు అని పిలిచినా అది మాత్రం మొట్టమొదటి నుంచి ఆయన్ని బాబాయి అని పిలిచేది. ఆయన కూడా అది తన స్వంత అన్నగారి కూతురే నన్నంత మమకారంగా చూచుకుంటాడు.

ఇంతలో కృష్ణయ్యగారి భార్య అమ్మణమ్మగారు వచ్చింది. ఆవిడ వంక ఒక్కక్షణం చూస్తేచాలు. ఆవిడ ఎంతో గొప్పయింటి ఆడబడుచని చెప్పకుండానే తెలుస్తుంది. ఐశ్వర్యంతో బాటు మంచితనం కూడా ఆవిడకి పుట్టుకతోనే వచ్చాయి. సాధారణంగా ఎవరింటికీ రాదు. వచ్చినా ఒక రోజుకంటె ఎక్కువ వుండదు. కాని పెద్దనాన్న గారి కుటుంబం విషయంలో మాత్రం యీ నియమం పాటించనవసరం లేదు. ఆవిడ మా దొడ్డమ్మకి ఆత్మీయురాలు. ఆవిడ దగ్గర మా అందరికి దొడ్డమ్మ దగ్గరన్నంత చనువు, రామకృష్ణుడిని చూడగానే ఆవిడ నవ్వుతూ.

"పరమహంసగారు కూడా వచ్చాడే. ఐతే మాకుమంచి వక్కపొడి దొరుకుతుందన్న మాట!" అని అంది.

"మీకొక డబ్బా స్పెషలుగా కేటాయించానులెండి" అని మా వారు సమాధానం చెప్పాడు. వక్కపొడి చేయించడంలో మా రామకృష్ణ ఒక క్రొత్తపద్ధతి కనిపెట్టాడు. పబ్లిసిటీ అంటె వాడికి ఇష్టంలేకపోవడం వల్ల వాడి పేరు ప్రపంచ విఖ్యాతి పొందలేదు. కాని అదే ఏ అమెరికాలోనైతేనా పేటెంటు సంపాదించి ఈ పాటికి లక్షలు గడించకపోనా? ఐనా వాడిపేరే రామకృష్ణ పరమహంస. ఎంతసేపు వాడి దృష్టి పరం మీదనే కాని 'ఇహం' మీద ఒక క్షణమైన నిలుస్తేనా? అందుకనే యీ విషయం కదిలిస్తే

"నాకెందుకురా పబ్లిసిటీ" అని అంటాడు. అమ్మణ్ణెమ్మగారు "ఆ డబ్బా తీసుకురా నాయనా" అని అనగానే రంగా లోపలికి వెళి 'హంట్లీ పామర్సు' రెండు పౌనుల డబ్బా ఒకటి తసుకువచ్చి ఆవిడకు యిచ్చాడు. ఆ డబ్బా రామకృష్ణుడి చేతిలో పెడుతూ

"మీ యిద్దరికీ" అని అన్నది.

దాంట్లో ఏం వుంటాయో మా యిద్దరికే తెలుసు కాని ఎప్పటికప్పుడే కొత్త. మాకోసం కాజాలు, పూతరేకులు, కోవాబిళ్ళలు, తీసుకురావడం ఆవిడకు అలవాటు, ఆవిడ తెచ్చేవాటి కోసం ఎదురు చూడటం మాకు అలవాటు.

మావాడు డబ్బా అందుకున్నాడు. నేను 'థాంక్సు' అని అన్నాను.

ఇంతలో మా జానకి టిఫిను తీసుకువచ్చింది. టిఫిను తిని కాఫీ తాగాం. వక్కపొడి కూడా వేసుకున్నాం. పెద్దనాన్నగారి పాతమేడ ఎక్కాం. సిగరెట్టు ముట్టించ బోతుంటే...

"ఎవరక్కడ?" అంటూ ఎవరో పిలిచారు. ఇద్దరం ఒక్కసారి గతుక్కుమన్నాం సిగరెట్లు దాచేశాం. అంతలోనే తెప్పరిల్లుకున్నాం, నవ్వుతూ మా జానికమ్మ మొగుడు వచ్చాడు.

"ఇంట్లో సిగరెట్టు కాల్చుకుందా మంటే మామగారు చూస్తారేమోనని భయం" అని అన్నాడు.

'డిటో' అని నేను, రామకృష్ణ అన్నాం.

అగ్ని కార్యం పూర్తిచేసుకుని, రామకృష్ణుడు నేను, వెళ్ళి డ్యూటీలో వెళ్ళి జాయిను అయ్యాం. మధ్యాహ్నం భోజనాల వేళకి నేను ఒక్కసారి వచ్చిన బంధువుల నందరిని పరీక్షగా చూశాను. నిరాశగా వచ్చి కూర్చున్నాను. నన్ను, నా వాలకం చూసి రామకృష్ణ.

"దిగులుపడకురా యింకా టైము వుందిగా" అని అన్నాడు. నేను ఏం మాట్లాడలేదు.

భోజనం చేసి వక్కపొడి కోసం జానకీ సుందరి వచ్చారు. వాళ్ళని ఒక్క ప్రశ్న అడుగుదామని నోటిదాకా వచ్చింది. ప్రశ్నకు సమాధానం రావడం మాట ఎల్లా వున్న వాళ్ళకి వాళ్ళ ప్రశ్నలకి సంజాయిషీ యిచ్చుకోవలసి వుంటుంది. అందుకని అడగాలని వున్నా అడగలేకపోయాను.

ఇంటిముందు ఏ బండీ ఆగినా ఒక్కసారి వెళ్లి చూసి వచ్చేవాడిని. ఎంతో నిరాశతో తిరిగి వచ్చేవాడిని.

మరునాడు ఉదయం సలక్షణంగా పెళ్లి జరిగింది. నేను మాత్రం కప్పుమీద కప్పు కాఫీ త్రాగుతూ సామానుల గదిలోనే కూర్చున్నాను. మధ్యాహ్నం రెండుగంటలకి పెళ్ళి వారి భోజనాలు కూడా అయిపోయాయి. నాకు భోజనం చెయ్యాలనిపించలేదు. అమ్మమ్మగారు యిచ్చిన కాజాలు రెండు తిని మంచి నీళ్లు త్రాగాను. రామకృష్ణుడు చేయించిన వక్కపొడి రవ్వంత వేసుకున్నాను.

ఉలిక్కిపడి లేచాను.

శ్యామలా అని పిలిచాను.

ఆ పిల్ల ఆగలేదు.

'శ్యామలా'

ఈసారి తల ఎత్తి నా వంక చూసింది.

"కులాసాగా వున్నావా?"

"ఊఁ"

మా జానకి సుందరి కలిసి వస్తున్నారు.

"మీతో చాలా మాట్లాడాలి, సాయంకాలం ఒకసారి కనిపిస్తారా !" బెదిరిపోయినట్టు చూసింది. ఏదో చెప్పబోయింది.

"పై డాబామీద" అని నేను అన్నాను.

శ్యామల ఏం మాట్లాడలేదు అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

ఇంతవరకూ బాధించిన నిరాశ, దిగులు, నిరుత్సాహం అన్నీ ఏమైయ్యాయో ఏమో మనస్సు మల్లెకంటె తేలికైంది. ఏదో అంతులేని ఆనందం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. మనస్సులో మసలే మాట ఒకటే సాయంత్రం ఎప్పుడు వస్తుంది! ఎప్పుడు వస్తుంది !

పెద్దనాన్న ఉత్తరం చూడగానే మనస్సులో మెరిసిన మాట ఒకటే. అనసూయ

పెళ్లికి శ్యామల తప్పకుండా వస్తుంది. అప్పుడు నా మనస్సులోని మాట చెప్పవచ్చు.

క్రిందటి సంవత్సరం ఇదే నెలలో దాదాపు ఇదే రోజుల్లో పెద్దనాన్న నాలుగో కూతురు పెళ్ళి జరిగింది. మామూలుగానే నేను, రామకృష్ణ సామానుల కొట్లో కూర్చున్నాం రెండవ రోజు మధ్యాహ్నం నేను ఒక్కడిని కూర్చొని కాఫీ త్రాగుతున్నాను. పెళ్ళివారి భోజనాలైయ్యాయి. విడిదికి వెళ్ళిపోయారు. ఇల్లు రవ్వంత నిశ్శబ్దంగా వుంది.

ఏదో పరధ్యానంగా కూర్చున్న నేను వులికిపడి గుమ్మం వైపు చూశాను. ఎవరో నాకు తెలియని పిల్ల నిలబడి వుంది. వెంట ఒక నాలు గేళ్ళ కుఱ్ఱవాడు కూడా వున్నాడు.

"ఏమండి?" అని నేను అన్నాను.

ఆ పిల్ల తలవంచుకునే "కొంచెం వక్కపొడి కావాలి" అని అన్నది. నేను మాట్లాడకుండాలేచి, ఒక గ్లాస్కో డబ్బానిండా వక్కపొడి పోసివుంటె ఆడబ్బా ఆ పిల్లచేతిలో పెట్టి...

"తీసుకోండి. అంతా తీసుకొండి." అని అన్నాను.

ఆ పిల్ల ఒక్కక్షణం నా వంక ఆశ్చర్యంగా చూసింది. మరుక్షణంలో చిరునవ్వు నవ్వింది. వక్కపొడి రెండు పలుకలు తీసుకొని, ఆ డబ్బా అక్కడ పెట్టి వెళ్లబోతుంటె, వెంట వున్న పిల్లవాడు లడ్డూల గంపవంక చూసి.

"లడ్డూకావాలి" అంటూ మారాం చేశాడు.

"ప్రతీది అల్లా అడగకూడదు." అంటూ ఆ పిల్లవాడిని అక్కడి నుంచి తీసుకు వెళ్లడానికి ప్రయత్నం చేసింది. వాడు అంగుళం కూడా అక్కడి నుండి కదలకుండా

"మరి నువ్వు వక్కపొడి అడగవచ్చా !" అంటూ ఎదురు సవాలు చేశాడు.

నేనొక లడ్డూ తీసుకువెళ్లి వాడి చేతిలో పెట్టాను. వాడు ఎంతో సంతోషించాడు.

ఆ పిల్ల చిన్న బుచ్చుకుంది. పిల్లవాడు లడ్డూ తినబోతూ ఆ పిల్లవంక ఒక్కసారి చూశాడు. నేను పరిస్థితి గ్రహించినట్టుగా

"తిను బాబు ! మీ అమ్మ ఏమీ అనదులే" అని అన్నాను.

"తినరా తమ్ముడూ" అని ఆ పిల్ల అనగానే, నేను పెద్దషాక్ తిని అంతలోనే తెప్పరిల్లుకుని లోపలికి వెళ్ళి ఒక గ్లాసులో మంచినీళ్ళుత్రాగి వస్తూ

"ఏమండీ, మంచినీళ్ళు కావాలా?" అని అడిగాను.

అక్కర్లేదన్నట్టుగా తలవూపింది. ఒక గ్లాసుతో మంచినీళ్ళు తీసుకువచ్చి కుఱ్ఱవాడి ఎదుట వుంచాను. తమ్ముడు లడ్డూ తిని సంతృప్తి పడ్డాడు. ఆ పిల్ల నీటితో వాడిమూతి తుడిచి, మంచినీళ్ళు తాగించింది. ఆగ్లాసు అక్కడ పెట్టేసి

వెళ్ళబోతు తమ్ముడి వంక తిరిగి 'థాంక్సు' చెప్పు అని అంది. వాడు నాకు షేక్‌హ్యాండ్ యిస్తూ

థాంక్యూ అని అన్నాడు.

'యు ఆర్ వెల్‌కమ్' అని అన్నాను. అక్కా తమ్ముడు బయలుదేర బోయారు. అప్పుడు నేను.

"ఏమండి !" అని పిలిచాను.

ఏమిటన్నట్టు నావంక చూసింది.

"మీరు ఆడపెళ్ళివారా మొగపెళ్ళివారా ?" అని అడిగాను.

"ఆడపెళ్లి వారం"

"ఆడపెళ్ళివారా, మిమ్మల్ని ఎప్పుడూ నేను చూడలేదే"

"పూర్వం పెళ్ళిళ్లకి నేను రాలేదు."

"అనసూయ, మీకేమవుతుంది?"

"అనసూయ వాళ్ళ నాన్న మా అమ్మమ్మ తమ్ముడు"

"మీ దేవూరు?"

"ఒంగోలు దగ్గర కనిగిరి"

"నాన్నగారి పేరు?"

"రాధాకృష్ణమూర్తి గారు, ప్లీడరు"

"సివిలా ? క్రిమినలా ?"

"రెండూ."

"మొట్టమొదట్లోనే అడగవలసింది. చివరికి అడుగుతున్నాని ఏమీ అనుకోకండి."

"ఏమిటది?"

"మీ పేరు ?"

"శ్యామల"

"బాగుంది. మూడక్షరాల పేరంటే నాకు చాలా యిష్టం"

నా మాటలికి కోపం వచ్చిందో ఏమో మాట్లాడకుండా, తమ్ముడిని ఎత్తుకుని అక్కడ నుంచి వెళ్లిపోయింది. నేను చేష్టలు దక్కి ఆ పిల్ల వెళ్ళిన వైపే చూస్తూ నిలబడ్డాను.

'రామం'

నేను ఉలిక్కిపడి అటూచూశాను. బియ్యం బస్తాల వెనకనుంచి పిలుపు మళ్ళీ వినిపించింది.

'ఏరా !' అని బదులు పలికాను.

"నాపేరు నాలుగు అక్షరాలు. నీకు నచ్చుతుందో లేదో"

"నువ్వులేచి ఎంతసేపయింది ?"

"శ్యామలా దేవి వక్కపొడి కోసం వచ్చినప్పుడే"

"మరి మాట్లాడలేదేం !"

'నవ్వొక ఇడియట్‌వి, టూయిజ్ కంపెనీ అండ్ త్రీయిజ్ క్రౌడ్ అప్పుడు నేనూ మాట్లాడితే ఏం జరుగుతుందో తెలుసా?'

"ఏం జరుగుతుంది ?"

"ఆవిడ బాణంలా దూసుకుపోతుంది. ఉన్న నాలుగు రోజులు యిటు కేసి చూడనన్నా చూడదు."

"పోరా ! నువ్వెపుడూ యిల్లాగే మాట్లాడుతావు"

ఆరోజు రాత్రి మళ్ళీ ఆ చిన్నదాని దర్శనమైంది. చాలామంది ఆడపిల్లలతో కలిసి వెడుతూ ఒక చూపు యిటువిసిరి వెళ్లిపోయింది. వక్కపొడి కోసం వస్తుందేమోనని నేను డబ్బాతో సహా సిద్ధంగా వున్నాను. కాని నేను లేనట్టుగానే ఆ పిల్ల వెళ్ళిపోయేసరికి, నాకు ఎంతో నిరాశకలిగింది. మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది. కోపం వచ్చింది. అక్కసు వచ్చింది. కాని ఏం చేస్తాను ?

భోజనం చేసి పై డాబామీద పడుకున్నాను. అక్కడ పడుకోవటానికి నాకూ రామకృష్ణుడికి యిద్దరికే పర్మిషను ఉంది. ఎందుకంటె, పెద్దనాన్నగారి మామిడి చెట్టు కొమ్మలు పై డాబా మీదకు వచ్చాయి. వేసంకాలంలో ఆకు కనిపించనంత దట్టంగా కాయలుకాస్తాయి. పెళ్లిలో కనుక పై డాబాకి తాళం వెయ్యక పోతే, పెళ్లికి వచ్చే వానరసైన్యం దండయాత్ర చేసి, కాయలేకాదు, ఆకుకూడా మిగల్చరు. సాయంకాలం కాగానే, నౌకరు సాంబడో, నరసయ్యో ఎవరో ఒకరువచ్చి తాళం తీసి అదంతా శుభ్రంగా వూడ్చి, నాది, రామకృష్ణుడివి ప్రక్కలు వేశేవాడు, ప్రొద్దున్న మేము లేచి రాగానే ఎత్తేసి మళ్లీ తాళం వేసేవాడు. పగలు పని అంతా అయిపోయిన తరువాత నేను రామకృష్ణ పైకి వచ్చి, ఏదో కబుర్లు చెప్పుకుంటూ పడుకునే వాళ్ళం. య్యీళ రాత్రి మాత్రం రామకృష్ణ ఏదో మాట్లాడుతూనే వున్నాడు. నేను మాత్రం 'పర'ధ్యానంగా వున్నాను.

ఈపూట కూడా శ్యామల వక్కపొడి కోసం వస్తే ఎంత బాగుండేది !!!

మరునాడు ఉదయం కూడా శ్యామల ఎక్కడా కనిపించలేదు. ఆ ధ్యాసలో వుండి నేను, వంటవాడు పంచదార కోసం వస్తే ఉప్పు యివ్వబోయాను. నా పరిస్థితి కనిపెట్టి రామకృష్ణుడే స్వయంగా కార్యరంగంలోకి దిగాడు. భోజనాల వేళ్లైంది.

'కాషాయిరంగు చీర వాళ్ళు యిద్దరున్నా రండి'

నేను ఏదో పని వున్నవాడిలాగా ఒక్కసారి పందిట్లోకి వెళ్ళి శ్యామల ఎక్కడ వుందో చూసి వచ్చాను.

'మన సుందరికి జానకికి మధ్య కూర్చుందే ఆ అమ్మాయికి యిచ్చిరా' అని అన్నాను.

వాడు ఇస్తాడో యివ్వడో నని నేను కనిపెడుతూనే వున్నాను. వాడు వెళ్లి ఆ గ్లాసు ఆ పిల్ల విస్తరి దగ్గర పెట్టగానే ఆ పిల్ల ఆశ్చర్యంతో వాడి వంక చూచి ఏదో అడిగింది. వాడు ఏదో సమాధానం చెబుతూ సామాను స్టోర్సు వంక చూపించాడు. ఆ పిల్లని ఏదో అంటూ మా జానకీ సుందరి ఫక్కున నవ్వారు. ఆపిల్ల తలవంచుకుంది.

భోజనాలైయ్యాయి. అందరూ పందిట్లో నుంచి లేచి వెళ్లిపోయారు.

'గ్లాసు తిరిగి యివ్వడానికి శ్యామల వస్తుంది. అప్పుడు మంచి వక్కపొడి యివ్వవచ్చు. గ్లాసు లేదని మొదట్లో పొరపాటుగా చెప్పినందుకు క్షమాపణ చెప్పుకోవచ్చు. అంటూ ఆ పిల్ల కోసం దాదాపు గంట సేపు ఎదురుచూశాను. ఆ పిల్ల రాలేదు. గ్లాసు రాలేదు.

మధ్యాహ్నం మూడు గంటలు దాటుతూ వుండగా పనిచేసేవాడు మిగతా గాజు సామానులతో బాటు ఆ గ్లాసుకూడా తీసుకువచ్చి నాకు యిచ్చాడు.

'ఈ గ్లాసు ఎవరిచ్చారు?' అని అడిగాను.

'వసారాలో గట్టుమీద పెట్టివుంది' అని వాడు సమాధానం యిచ్చాడు.

నాకు గ్లాసు తిరిగి యివ్వకుండా వెళ్ళిపోవడానికి కారణం నా మీద కోపం వచ్చిందా ? అందుకనే కాబోలు వక్కపొడి కోసం రాలేదు.

ఐనా రోజూ రావాలని ఏమన్నా నియమం వుందా? పెళ్ళివారికి పళ్లాలలో తమలపాకులు సున్నం వగైరా పంపిస్తూనే వున్నాంగా, దాంటోంచి తీసుకుందేమో! పెళ్ళికొచ్చిన వారంతా నా దగ్గర నుంచే వక్కపొడి తీసుకుంటున్నారా ? ఐతే యీ పిల్ల ఎందుకు వచ్చింది ? వక్కపొడి అయిపోయి వుంటుంది. అందుకని వచ్చింది.

'మరి గ్లాసు ?'

గ్లాసు తిరిగి యివ్వటానికి నిన్నడిగి తీసుకు వెళ్ళిందా ?

నిజమే !

"ఎక్కడ వుందో ఒక్కసారి వెళ్లిచూసి వస్తే !"

"డోంట్ బి ఎ ఫూల్"

'అన్నయ్యా' అంటూ జానకి కంఠం నన్ను పలుకరించింది. శ్యామల గ్లాసు యివ్వటానికి కాని, వక్కపొడి కోసం గాని రావపోవటానికి కాని కారణం, యీ జానకి కాని సుందరి కాని కావచ్చు అని మనస్సుకు తట్టగానే జానకి మీద కోపం వచ్చింది. అందుకని నేను బదులు పలకలేదు.

'నిన్నేరా ! నాన్న పిలుస్తున్నాడు'

'నేనేం మాట్లాడలేదు'

ఇదెక్కడ చెమిటి మాలోకమమ్మా

నాకేం చెవుడు లేదు.

సంతోషం నీకు పెళ్ళివారు బట్టలు పెడతారట.

"నాకేం అక్కరలేదు."

"నాన్నతో చెప్పనా?"

"చెప్పు, నాకేమన్నా భయమనుకున్నావా ?"

జానకి అక్కడ నుంచి వెళ్ళిపోయింది. మరుక్షణంలో నాకు స్పృహ వచ్చింది. జరిగిన పొరబాటు అర్థమైంది. పెళ్ళివారు ఏమనుకుంటారు ! పెద్దనాన్న ఎంత బాధపడతాడో అనుకుని వెంటనే పెద్దనాన్న దగ్గరకు వెళ్ళాను. ఆయన వాలకం చూస్తే జానకి ఏం చెప్పినట్టులేదు. పెళ్ళికుమారుడి తండ్రి నాకు మంచి బట్టలు పెట్టాడు. నేను ఆయనకి నమస్కరించి తిరిగి వస్తుంటే, అమ్మణిమ్మ గారు, శ్యామల, యింకో పెద్దావిడా ఎవరో కనిపించారు. నన్ను చూడగానే అమ్మణిమ్మగారు చిరునవ్వుతో

'రామం' అని పలుకరించారు.

'ఏమండీ ?' అని నేను బదులు పలికాను.

'ఇతనేనండి మా రామం. ఎంతో మంచివాడు' అని అంటూ యింకో ఆవిడతో చెప్పారు.

ఏం చదువుతున్నావు ? అని ఆవిడ అడిగింది.

బి.ఏ., ప్యాసు అయ్యాను.

'పైన చదువుతావా'

చదవాలనే వుందండి.

శ్యామల ఏమీ తెలియని దానిలాగా తల వంచుకుని నిలబడ్డది.

'మంచిది. బాగుంది' అని ఆవిడ అంది. వస్తానండి వదినగారు అంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

'ఎవరండీ ఆవిడ ?' అని అడిగాను.

'మీ కాబోయే అత్తగారు.'

"పొండి. మీరుఎప్పుడు యిల్లాగే అంటారు."

అంటూ అక్కడ నుంచి వచ్చేశాను. కాలు భూమి మీద నిలవడం లేదు. మనస్సుకి రెక్కలు కట్టుకుని ఎగిరి పోదామన్నంత ఆనందంగా వుంది. ఆ పూటకి కావలసిన పనులన్నీ అలవికాని వేగంతో పూర్తి చేశాను. స్నానం చేసి డ్రస్ చేసుకున్నాను. వెలుగుపోయి వెన్నెల వచ్చింది. ఒక అరగంట సేపు పై డాబా మీద కూర్చుందాం అని పైకి బయలుదేరాను. వెడుతున్న వాడినల్లా చివరి మెట్టు దగ్గర ఆగిపోయాను.

ఎవరో పిల్ల ముఖం రెండు చేతుల్లో కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఎవరో ? ఎందుకో ? అని అనుకుని వెనక్కి తిరగబోయాను, శుభమా అని యింట్లో పెళ్ళి జరుగుతూవుంటె, యీ పిల్ల యిల్లా ఏడవటానికి వీలులేదు. కారణం కనుక్కుదాం. చెయ్యగలిగిందేమన్నా వుంటే చేద్దాం అని అనుకుంటూ రెండడుగులు ముందుకువేసి.

'ఏమండి!' అని పిలిచాను.

ఉలిక్కిపడి నా వంక చూసింది. శ్యామల ! నన్ను చూసి అక్కడ నుంచి వెళ్ళిపోబోయింది.

"ఏం జరిగింది !" అని అడిగాను.

"ఏం జరిగిందో తెలియదా !"

"నిజంగా నాకేం తెలియదు"

"మధ్యాహ్నం గ్లాసు ఎందుకు పంపించారు ?"

"మీరు ఇబ్బంది పడతారేమోనని."

"లేదు, నన్ను నలుగురిలో అల్లరి చెయ్యటానికి."

"ఇందులో అల్లరేముంది."

"మీ జానకి, సుందరీ ఏమన్నారో తెలుసా ?"

"ఏమన్నారు ?"

శ్యామల ఏం మాట్లాడలేదు.

"ఏమన్నారో చెప్పండి."

"ఎందుకులెండి చెప్పడం ?"

"మీకు అవమానం కలిగించే మాటైతే వాళ్ల చేత క్షమార్పణ చెప్పిస్తాను."

క్షమార్పణలు ఏం అక్కర్లేదుండి. ఇహముందు సరిగా ఉంటేచాలు అంటూ అక్కడనుంచి కదలబోయింది నేను కావాలనే దోవకి అడ్డంగా నిలిచాను.

"వాళ్ళు మిమ్మల్ని ఏదో అన్నారని బాధ పడుతున్నారు. దానికి కారణం కూడా నేనేనని మీ ఉద్దేశ్యం, మీకు బాధ ఎందుకని కలిగిందో తెలుసుకోవడం దానికి పరిహారం చెల్లించడం నా డ్యూటీ"

"నన్నేం అడక్కండి."

"చెప్పకపోతే నా మీద ఒట్టు" అని నేను అన్నాను.

మా యిద్దరి మధ్య పిడుగు పడ్డంత నిశ్శబ్దం.

ఆ పిల్ల తల వంచుకుని బ్రొటనవేలితో నేల మీద గీతలు గీస్తూ.

"మీరు గ్లాసు పంపించినప్పటినుంచి........"

వాళ్ళిద్దరు, నన్ను వదినే-వదినే-అని పిలుస్తున్నారు అందరిలో చెప్పి వేళాకోళం చేస్తున్నారు.

ఇందులో వేళాకోళం ఏముంది.

ఏం జరిగింది ?

వాళ్ళిద్దరు నన్ను వదినే- వదినే అని పిలుస్తున్నారు. అందరిలో చెప్పి వేళాకోళం చేస్తున్నారు. ఇందులో వేళాకోళం ఏముంది.

"వేళాకోళం కాదా ఏమిటి ? వాళ్ళు నాకు మేనత్త వరుస."

ఆపిల్ల మాటలు నాకు అర్థం కావటానికి అరక్షణం పట్టింది.

'వదినే అని పిలవడం మీకు యిష్టం లేదా ! ఇష్టం లేకపోతే చెప్పండి. వాళ్లిద్దరిచేత మాన్పిస్తాను.'

అమ్మమ్మగారు అయితే నలుగురిలో పట్టుకుని....

"ఏమన్నారు ?"

"ఏమంటారు !"

"చెప్పండి."

ఆ పిల్ల చెప్పడానికి సిగ్గుపడింది.

"చూడండి మనం బంధువులం. పైగా స్నేహితులం నా దగ్గరెందుకు సిగ్గు !"

'మా రామం నచ్చాడా" అని అడిగారు.

'మరి మీరేమన్నారు.'

"నేనేమనలేదు"

'సరే జానకి వాళ్ళని వదినే అని పిలువద్దని చెబుతానులెండి.'

శ్యామల ఒక్క క్షణం తటపటాయించింది

'అందరిలోను అల్లా పిలవవద్దని చెప్పండి అంటూ అక్కడి నుంచి క్రిందకు వెళ్ళిపోయింది. క్రిందకు వెళ్ళుతున్న ఆ పిల్లతో నేను థాంక్యూ అని అన్నాను. మెడుతున్న మనిషి ఒక్కసారి ఆగి నా వంక క్రీగంట చూసి వెళ్లిపోయింది.

ఆకాశం వంక చూశాను. పుచ్చ పువ్వులా వెన్నెల కాస్తోంది. వసంత ఋతువు నిండుపున్నమి వెడుతున్న శ్యామల వంక చూశాను. ఆ పిల్ల జడలోని పూల చెండు నన్ను చూచి నవ్వినట్టనిపించింది.

జానక్కి సుందరికి శ్యామల వదినైతే, నాకేమవుతుంది ?

శ్యామల నాకేమవుతుంది ?

ఈ ప్రశ్నకు సమాధానం నాకు తెలుసు కనుక యీ అంతులేని ఆనందం శ్యామలకు కూడా తెలుసు. కనుకనే యీ అంతులేని ఆనందం. అందుకనే పుష్పాంగి నన్ను చూచి నవ్వింది. నా జీవితంలో యీ పున్నమి ఎంతో మహత్తరమైంది. ఇది పువ్వు నవ్విన పున్నమి.

ఆ రాత్రి ఎన్ని మధుర స్వర్గాలని నా మనస్సు చూసిందో నేను చెప్పలేను. నాకు గుర్తు వుందల్లా, చిరునవ్వుతో నా వంక చూసే శ్యామల ముఖం.

వెన్నెల పోయి వెలుగు వచ్చింది. కలలు కరిగి కల్లలే మిగిలాయి.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకి శ్యామల తమ్ముడితో సహా దర్శన మిచ్చింది. తమ్ముడిని నడిపించుకుంటూ నా ముందర నుంచి వెళ్ళిపోతూంది. చిన్నవాడు నన్నుచూచి చిరునవ్వు నవ్వాడు.

'లడ్డూ కావాలా ?' అని అడిగాను.

'వద్దు' అని అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యం వేసి ఏం ? అని అడిగాను.

'మా దగ్గర చాలా లడ్డూలున్నాయి.'

'మేము వూరికి వెళ్లిపోతున్నాం' అని శ్యామల అంది.

'ఎప్పుడూ ?'

' ఈపూట గ్రాండు ట్రంకులో'

నాకు కాళ్లక్రింద భూమి కృంగిపోతున్నట్టు అనిపించింది. రెండు క్షణాలదాకా ఏం మాట్లాడలేకపోయాను.

"మళ్లీ ఎప్పుడు వస్తారు ?"

"అనసూయ పెళ్ళికి."

"మరచిపోకండి."

"...మీరే మరిచిపోతారు."

"ఆ అలవాటు నాకు లేదు."

"మాకూ ఆ అలవాటు లేదు" అంటూ శ్యామల వెళ్లిపోయింది.

"కొంచెం వక్కపొడి తీసుకోండి" అంటూ డబ్బా శ్యామల ముందర పెట్టాను.

"భోజనం చేయందే వేసుకోను."

"ప్లీజ్"

రెండు పలుకులు తీసుకుని నోట్లో వేసుకుంటూ 'థ్యాంక్యూ... వస్తాను' అంటూ శ్యామల వెళ్లిపోయింది.

ఆ మరునాడు నేనుకూడా బయలుదేరి మదరాసు వచ్చేశాను. పున్నమిని చూస్తే శ్యామల గుర్తు వచ్చేది. రెండుజడల వ్యక్తి ఎవరు కనిపించినా శ్యామల తలంపే కలిగేది. ఒకసారి శ్యామలని చూచిరావాలి అని అనిపించేది. మళ్లీ వసంత మొచ్చింది. నా మనసులో ఒక నిశ్చయం ఏర్పడ్డది.

ఏడాది గడిచిన తరువాత ఈ అవకాశం వచ్చింది. పై డాబామీదకు ఎక్కి పున్నమి వంక చూస్తూ నిలబడ్డాను.

శ్యామల మేడమీదకు వచ్చింది. ఏడాదిలో ఆ పిల్ల అందం ఎన్నో రెట్లు పెరిగింది. డాబా పిట్టగోడ ఆనుకుని నిలబడ్డది.

"కులాసాగా వున్నావా?"

"కులాసాగానే వున్నాను."

నేను ఎన్నో మాటలు చెపుదామని అనుకున్నాను. కాని శ్యామలని చూడగానే నా మనసు మూగబోయింది. కొద్ది క్షణాలు ఏం మాట్లాడలేదు.

"ఒక్కమాట చెప్పనా శ్యామలా."

"ముందర యీమాట చెప్పండి. నన్ను మేడమీదకు రమ్మని చెప్పే అధికారం మీ కెవరిచ్చారు?"

"శ్యామలా!!!"

"మీకు మనుష్యులకంటె డబ్బే ప్రధానం"

"ఏమిటి శ్యామలా నువ్వంటుంది?"

"నేను ఏమంటున్నానో మీకు తెలుసు. మానాన్న వస్తే - మీ వాళ్ళేమన్నారో తెలియదా?"

'నాకేం తెలియదు. ఈ ఏడాది అంతా మదరాసులో వున్నాను. ఏమన్నారు?'

"కట్నం ఇరవైవేలు కావాలని అడిగారు. అంతకు తక్కువైతే తమ గుమ్మంలోకి రావలసిన అవుసరం లేదన్నారు."

"ఇది ఎప్పుడు జరిగింది?"

"మొన్న సెప్టెంబరులో."

"నామాట నమ్ము శ్యామలా! నేను మా వాళ్ళని ఒప్పిస్తాను. మీరు కట్నం ఏం యివ్వనక్కర్లేదు. ఒక్కమాట నీతో చెబుదామని యీ ఏడాది అంతా అహర్నిశలు ఎదురుచూశాను. నిన్ను చూచిన క్షణం నుంచి నీ రూపమే నా హృదయంలో నిలచిపోయింది. నిన్ను ఎప్పుడు నా..."

"వద్దు వద్దు చెప్పకండి."

"ఎందుకు?"

"నా వివాహమైంది."

"ఎప్పుడు?"

"రెండు నెలల క్రితం..."

"శ్యామల ప్లీజ్ గోయెవే. దయచేసి వెళ్ళిపో" అని బిగ్గరగా అరుద్దామనిపించింది. కాని చాలాసేపు ఏం మాట్లాడలేకపోయాను. చివరికి,

"ఐ యాం సారీ... ఐ యాం వెరీ సారీ" అని అన్నాను.

శ్యామల ఏం మాట్లాడలేదు. మెల్లిగా క్రిందకు వెళ్ళిపోయింది. ఆ పిల్ల తల్లో మల్లెచెండు పున్నమి వెలుగులో నవ్వుతున్నట్టుంది. పున్నమే నవ్వుతోంది. సర్వస్వం పోగొట్టుకున్న అభాగ్యుడిని నేనొక్కడినే నవ్వలేకపోయాను.